రెండోవిడత చేప పిల్లలకు గ్రీన్‌సిగ్నల్



- మంత్రి పొంగులేటి ప్రత్యేక చొరవ
- రాష్ట్రంలో ఒక్క ఖమ్మం జిల్లాకే దక్కిన అవకాశం
- జిల్లాకు రానున్న 1.07 కోట్ల చేపపిల్లలు

వైరా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక్క ఖమ్మం జిల్లాలోనే రెండోవిడత ఉచిత చేపపిల్లల సరఫరాకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార ప్రసార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ ఫలితంగానే ప్రభుత్వం నుంచి ఈ అనుమతి లభించింది. రాష్ట్రంలో 33 జిల్లాలుండగా ఒక్క ఖమ్మంజిల్లాకు మాత్రమే రెండోవిడత ఉచిత చేపపిల్లల సరఫరాకు ఆమోదం లభించింది. మొదటి విడతలో ఖమ్మంజిల్లాలోని నాలుగు రిజర్వాయర్లు, 272 పెద్ద చెరువులు సహా మొత్తం 876 చెరువులు, కుంటల్లో ఉచిత చేపపిల్లల సరఫరాకు ప్రభుత్వం అనుమతించింది. రూ.2.27కోట్ల విలువైన 1.75 కోట్ల చేపపిల్లలను మొదటి విడతలో సరఫరా చేశారు. వీటిలో 80 నుంచి 100 మిల్లీమీటర్లు సైజు కలిగిన 1.07 కోట్ల చేపపిల్లలను నాలుగు రిజర్వాయర్లు, 272 పెద్ద చెరువుల్లో అలాగే 35-40 మిల్లీ మీటర్లు సైజు కలిగిన 68 లక్షల చేపపిల్లలను 600 చిన్నతరహా కుంటలు, చెరువుల్లో విడుదల చేశారు.

మంత్రి చొరవ...

ఖమ్మం జిల్లాలో మొదటిగా పాలేరు రిజర్వాయర్‌లో గతనెల తొమ్మిదోతేదీన ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 6.65 లక్షల ఉచిత చేపపిల్లలను విడుదల చేశారు. తమకు పూర్తిస్థాయిలో ఉచిత చేపపిల్లలు సరఫరా చేయాలని మత్స్యకారులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదేనెల 11వ తేదీన జరిగిన రివ్యూ మీటింగ్‌లో కూడా రెండోవిడత ఉచిత చేపపిల్లల సరఫరా అంశం ప్రస్తావనకు వచ్చింది. ఆ వెంటనే పొంగులేటి రాష్ట్ర మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక అలకు ఫోన్ చేసి రెండోవిడత చేపపిల్లల సరఫరా విషయాన్ని ప్రస్తావించారు. పాలేరుతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు రెండోవిడత చేపపిల్లల సరఫరాకు అనుమతించాలని స్పష్టం చేశారు. అదే సమయంలో గతనెల 14వ తేదీన జిల్లా మత్స్యశాఖ అధికారి అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు.

రెండోవిడతగా 1.07 కోట్ల ఉచిత చేపపిల్లలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత సీజన్‌లో చిన్నతరహా చెరువులు, కుంటల్లో చిన్నసైజు చేపపిల్లల విడుదలకు వాతావరణం అనుకూలంగా ఉండదు. ఈ పరిస్థితుల్లో వైరా, పాలేరు, లంకాసాగర్, బేతుపల్లి రిజర్వాయర్లతోపాటు (మిగతా 6వ పేజీలో)

ఆయిల్‌పామ్‌కు మహర్దశ



- గెలల టన్ను ఒక్కంటికి రూ.19,144 ధర
- గత నెల కంటే రూ.2,101 పెరుగుదల
- ఫలించిన మంత్రి తుమ్మల కృషి
- ఉమ్మడి జిల్లా ఆయిల్‌పామ్ రైతుల్లో హర్షాతిరేకాలు

అశ్వారావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ రైతులకు ఈ ఏడాది అన్నీ శుభశకునాలే కనిపిస్తున్నాయి. కొద్ది నెలలక్రితం వరకు టన్ను ఒక్కంటికి రూ.13వేల లోపే ధర పలికిన పామాయిల్ గెలల ధర... రెండు మూడు నెలల నుంచి వేగంగా పెరుగుతూ రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కృషితో పామాయిల్‌పై 27.5శాతం దిగుమతి సుంకాన్ని పెంచడం, ఆయిల్ రికవరీ శాతం, ఇతరత్రా చర్యలు, కేంద్ర ప్రభుత్వంలో జరిగిన చర్చల వల్ల ఆయిల్‌పామ్ గెలల ధర టన్ను ఒక్కంటికి అక్టోబరు నెలకు రూ.19,144కు ఎగబాకింది. ఇది గత నెల కంటే టన్నుకి రూ.2,101, సెప్టెంబరు నెలతో పోలిస్తే ఏకంగా టన్నుకి రూ.4,756 మేర ధర పెరిగింది.

ఏడు వేలమంది రైతులకు ప్రయోజనం



గత జూలైనెల వరకు రూ.12వేల లోపు ఉన్న పామాయిల్ గెలల ధర నాలుగు నెలల్లోనే ఏకంగా టన్ను ఒక్కంటికి రూ.7వేలకు పైగా ధర పెరిగింది. చాలాకాలంగా పామాయిల్ గెలలు ధర పడిపోవటంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలవడంతో పాటు కేంద్ర వ్యవసాయ శాఖాధికారులతో పలు దఫాలుగ సంప్రదింపులు జరిపి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5శాతంకు పెంచేలా కృషి చేసారు. వీటి ఫలితంగా పామాయిల్ ధర రోజురోజుకు టాప్ గేర్‌లో పెరుగుతూ వస్తున్నది. పామాయిల్ పంట తెలంగాణ రాష్ట్రంలో 90శాతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే విస్తరించి ఉంది. దీంతో ధర పెంపుద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన రైతులకే అధికంగా ప్రయోజనం చేకూరుతుంది. ధర పెరగటం ద్వార రెండు లక్షల టన్నుల గెలలను ఉత్పత్తి చేస్తున్న 7వేల మందిపైన రైతులకు ప్రయోజనం కలుగుతుంది.




దీపావళి వేళ..

ఎంపీ రేణుకాచౌదరికి మంత్రి తుమ్మల శుభాకాంక్షలు

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం సందర్భంగా రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరికి మంత్రి తుమ్మల శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని రేణుకాచౌదరి నివాసానికి మంత్రి తుమ్మల స్వయంగా వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించారు. అలాగే ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ నివాసంలో దీపావళి వేడుకలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి మేయర్ దీపాలు వెలిగించి, కాకరొత్తులు కాల్చి పండగను జరుపుకొన్నారు.

సీటే స్వీటు..

ఉమ్మడి రాష్ట్రంలో అధికారుల పనితీరు ఆధారంగా జిల్లా, రెవెన్యూ డివిజన్, మండలస్థాయిలో పోస్టింగ్‌లు ఇచ్చిన పరిస్థితి ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత గడిచిన పదేళ్లలో కీలక ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రభుత్వ శాఖల అధికారుల పోస్టింగ్‌ల విషయంలో ప్రజాప్రతినిధుల సిఫారసులకే పెద్దపీట వేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల లేఖలతో సిఫారసు చేస్తేనే జిల్లాలో కీలకమైన రెవెన్యూ, పోలీసు, వైద్య, ఆరోగ్యం, విద్య, రిజిస్ట్రేషన్, మైనింగ్, సంక్షేమం, తదితర శాఖలకు సంబంధించిన అధికారుల నియామకం, బదిలీల ప్రక్రియ ఉండేది. దీంతో ప్రజల సంక్షేమం పక్కన పెట్టి సిఫారసు చేసి ప్రజాప్రతినిధుల ఆదేశాలే ప్రధానంగా భావించి జిల్లాలో ఆయాశాఖల అధికారులు పాలన సాగించారు. దీంతో అధికార పార్టీనేతల ఆదేశాలకు, ప్రజాప్రతినిధుల మాటలకు శిరసావహించి అధికారులు పనిచేయడం ఆనవాయితీగా ఉండేది.



పైరవీలతో పోస్టింగులు

పక్క జిల్లాకు బదిలీ అయినా సిఫారసుతో మళ్లీ వెనక్కి

- తిరుగుటపాలో అధికంగా 'గులాబీ' వాసన
- రెవెన్యూ శాఖలోనూ పైరవీలకే పెద్దపీట
- నేడో, రేపో మరిన్ని జిల్లా పోస్టులు తారుమారయ్యే అవకాశం

ఖమ్మం, నవంబరు 1(ఆంధ్రజ్యోతిప్రతినిధి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఏసీపీలు, డీఎస్పీలు మళ్లీ ఏదో ఒక సిఫారసుతో జిల్లాలో పోస్టింగ్‌లు పొందుతున్నారు. జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసిన వారికి పక్కజిల్లాల్లో పోస్టింగ్‌లు వేసినా.. వెళ్లడం లేదు. వెళ్లినా చుట్టపు చూపుగానే వెళ్లి మళ్లీ వస్తున్నారు. గతంలో పోలీసుశాఖ పోస్టింగ్‌లపై జిల్లాలో తీవ్ర చర్చ జరిగింది. ఏజెన్సీ, నాన్ ఏజెన్సీలో పోలీసు పోస్టింగ్‌లు నిజాయితీ, నిబద్ధత, పనితీరుకంటే వ్యక్తిగత సిఫారసులకే పోస్టింగ్‌లు లభించాయి. దీంతో ఏజెన్సీ నుంచి ఇసుక రవాణాలో కొందరు పోలీసు అధికారులు ఇసుక వ్యాపారులకు పరోక్ష సహకారం అందిస్తున్నారు. పోస్టింగ్ నియామకాల్లో కూడా ఇసుక వ్యాపారుల పైరవీలు తెరవెనుక ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయి. గతంలో బీఆర్ఎస్ హయాంలో గోదావరి ఇసుకను అక్రమంగా తరలించిన ఇసుక వ్యాపారులే ఇప్పుడు తెరవెనుక కథ నడిపిస్తున్నారు.

రెవెన్యూ శాఖలోనూ అదే తంతు..

రెవెన్యూశాఖ విషయానికి వస్తే ఉమ్మడి జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో తహసీల్దార్లుగా పనిచేసి ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులు మళ్లీ ప్రమోషన్లతోనే, డిప్యుటేషన్లతోనే జిల్లాకే వస్తున్నారు. సిఫారసులతో పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో కీలకశాఖ అధికారి పోస్టింగ్ వ్యవహారం కూడా జిల్లాలో చర్చ నడుస్తోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో కొన్నేళ్లపాటు విధులు నిర్వహించగా.. పలు ఆరోపణలతో అప్పట్లో బదిలీ జరిగింది. అయితే ఇటీవల ఆ శాఖలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారి బదిలీకావడంతో అదేశాఖలో అర్హత ఉన్న మరో అధికారి పోస్టింగ్ పొందారు. పట్టుమని నెలరోజులు కూడా చేయకముందే బీఆర్ఎస్ హయాంలో ఆ పోస్టులో పనిచేసిన అధికారికే మళ్లీ బాధ్యతలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

పోస్టింగుల్లో గులాబీ వాసన..

ప్రభుత్వం మారినా ఇప్పుడు జిల్లాలో కూడా ఇంచుమించుగా అదే తంతు సాగుతోంది. అధికారుల పనితీరు, నిబద్ధత పక్కన పెట్టి సిఫారసు లేఖలతో పోస్టింగ్‌లు సాధించుకుంటున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులే మళ్లీ దొడ్డిదారిన ఎవరో ఒక ప్రజాప్రతినిధిని పట్టుకుని పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు. దీంతో పోస్టుల్లో గులాబీ వాసనే కనిపిస్తోంది. రేపో మాపో మరికొన్ని జిల్లా శాఖ పోస్టులు కూడా తారుమారయ్యే అవకాశం నెలకొంది. ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ, పోలీసుతో పాటు విద్య, వైద్యంతోపాటు పలు శాఖల అధికారుల పోస్టుల కోసం కొందరు తెరవెనుక పైరవీలు సాగిస్తున్నారు. నేతల సిఫారసులతో మరికొన్ని బదిలీలు ఉండే అవకాశం ఉంటుందని ప్రచారం జరుగుతుంది. అయితే బీఆర్ఎస్ హయాంలో పనిచేసిన అధికారులకే మళ్లీ పోస్టింగ్‌లు వస్తుండడం చెప్పుకోదగిన విషయం. బీఆర్ఎస్ హయాంలో కక్షసాధింపు చర్యల్లో భాగంగా బదిలీకి గురైన పలువురు అధికారులు మాత్రం తిరిగి జిల్లాలో పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నా వారికి పోస్టింగ్‌లు దక్కడం లేదు. అప్పుడు వేధింపులకు గురైన అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వాలని కొందరు అధికార పార్టీనేతలు కోరుతున్నా.. అది అమలుకావడం లేదు.

నేటి నుంచి భద్రాద్రిలో కార్తీకమాస పూజలు

- నాలుగు సోమవారాలు గోదావరికి నదీ హారతుల సమర్పణ
- డిసెంబరు 1 వరకు కొనసాగనున్న వేడుకలు



మీడియాతో మాట్లాడుతున్న ఈవో రమాదేవి

భద్రాచలం,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. భద్రాద్రి దేవస్థానం ఉప ఆలయమైన శ్రీఅన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం (శివాలయం)లో శనివారం నుంచి డిసెంబరు 1వరకు కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు, సేవలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

శివాలయంలో 4న స్వామివారికి భస్మాభిషేకం, జ్యోతిర్లింగార్చన (దీపాలు వెలిగించటం), ఆకాశ దీపోత్సవం, పురాణ ప్రవచనం, నీరాజన మంత్ర పుష్పం ప్రసాదవితరణ చేయనున్నామని తెలిపారు. 11న శివాలయంలో చందనోత్సవం(చందనాలంకారం), పురాణ ప్రవచనం, ఆకాశ దీపోత్సవం, పురాణ ప్రవచనం, జ్యోతిర్లింగ దీపోత్సవం, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహిస్తామని తెలిపారు. 15న కార్తీక పౌర్ణమిపురస్కరించుకుని రుద్రాభిషేకం పురాణ ప్రవచనం, ఆకాశ దీపోత్సవం, పురాణ ప్రవచనం, జ్యోతిర్లింగ దీపోత్సవం, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం చేయనున్నట్టు వెల్లడించారు. 17న స్వామి వారి కల్యాణం గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. 18న పుష్పోత్సవం(ప్రత్యేక పుష్పాలంకరణ), మహా నివేదన, ఆకాశ దీపోత్సవం, పురాణ ప్రవచనం, జ్యోతిర్లింగ దీపోత్సవం, తీర్థ ప్రసాద వినియోగం చేయనున్నామన్నారు.

25న మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన,పురాణ ప్రవచనం, ఆకాశ దీపోత్సవం, జ్యోతిర్లింగ దీపోత్సవం, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం చేయనున్నామన్నారు. కార్తీక మాసంలో నాలుగు సోమవారాలు నదీహారతులు పవిత్ర గోదావరీ నదీ తీరంలో స్వామివారి పాదుకలను తీసుకుని వెళ్లి నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఈవో భవానీ రామకృష్ణారావు, వేద పండితుడు లింగాల రామకృష్ణ ప్రసాద్, శివాలయ అర్చకుడు అయిలూరి సుబ్రమణ్య శర్మ, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, కిషోర్, సిసి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులే...

- కమ్యూనిస్టులను అంతం చేస్తామన్న వారు కాలగతిలో కలిసిపోయారు
- ఆనాటి హిట్లర్‌కు నేటి నరేంద్ర మోదీకి తేడా లేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

6



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రతిష్టాత్మకంగా 'వన సమారాధన'

- ఉద్యోగుల్లో ఐక్యత, మానసికోల్లాసం కోసం రేపు ఆత్మీయ సమ్మేళనం
- పాల్గొననున్న ముగ్గురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు

6



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు

జమలాపురానికి కార్తీక శోభ

- వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి ప్రత్యేక పూజలు
- ఆకాశదీపం, సామూహిక వ్రతాలు, దీపోత్సవాలు



ఎర్రుపాలెం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకోనుంది. ఈ నెలరోజుల పాటు ఆకాశదీపం, కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్టు ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం తెలిపారు. శనివారం నుంచి డిసెంబరు 1వరకు ఆలయంలో కార్తీకమాస పూజలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

కార్తీకమాసం శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైనదని ఈ మాసంలో చేసే స్నానం, దీపారాధన, అర్చన, అభిషేకం, దానం లక్షల రెట్లు ఫలితాలు ఇస్తాయని ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా ఆలయంలో శ్రీవారి సన్నిధితోపాటు శివాలయంలో నిత్యాభిషేకములు, ప్రత్యేక పూజలు, ప్రతిరోజు ఆకాశదీపోత్సవం, నిత్య అన్నదానం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, శ్రీవారి పుష్కరిణిలో కార్తీక దీపోత్సవం, గంగా హారతి, కార్తీక పురాణం, శివపురాణం, విష్ణు సహస్రనామ పారాయణం, ప్రత్యేక భజనలు, కోలాటాలు ప్రతిరోజు ఈనెల రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్తీక సోమవారాలు, పౌర్ణమి, ఏకాదశులలో, పూజలలో పాల్గొనే మహిళలకు పసుపు, కుంకుమ, పూలు, గాజులు, జాకెట్ ముక్కలను దేవస్థానం తరుపున అందించనున్నట్టు తెలిపారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు 6

చెల్లెలితో గొడవ పడొద్దన్నందుకు..

- మరిదిని పొడిచి చంపిన వదిన
- దీపావళి వేళ ఎం.వెంకటాయపాలెంలో దారుణం



ప్రదీప్ (ఫైల్)

ఖమ్మం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. సొంత వదిన చేతిలో మరిది హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన ఖమ్మంరూరల్ మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కొర్లి రామయ్యకు ప్రశాంత్, ప్రదీప్(27) ఇద్దరు కమారులు, ఓ కూతురు ఉన్నారు. రామయ్య భార్య ఐదేళ్ల క్రితం మృతిచెందింది. పెద్ద కుమారుడు ప్రశాంత్‌కు 10నెలల క్రితం వివాహం జరిగింది. కూతురుకు కూడా వివాహం చేశారు. తండ్రి రామయ్య, పెద్దకుమారుడు ప్రశాంత్, అతని భార్య ఇందు, చిన్న కుమారుడు ప్రదీప్ ఒకే ఇంట్లో ఉంటున్నారు.

దీపావళి పండుగ సందర్భంగా కూతురు ప్రవళికను ఇంటికి పిలుచుకున్నారు. ఇంటిలో శుభ్రత విషయమై గురువారం రాత్రి ప్రవళికకు, వదిన ఇందూకి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ప్రదీప్ వచ్చి తన చెల్లిని పక్కకు తీసుకువెళ్లాడు. అనంతరం ఇంట్లోకి వచ్చి, తన చెల్లితో ఎందుకు గొడవ పడుతున్నావని వదిన ఇందూను ప్రశ్నించాడు. దీంతో వదిన, మరిది మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వెంటనే ఇందు పక్కనే ఉన్న తన పెద్దమ్మ రెంటాల మణి, అమ్మమ్మ రెంటాల భాగ్యమ్మ, మరో బంధువు దాసరి బాయమ్మల వద్దకు వెళ్లి జరిగి ఘర్షణను వారికి వివరించింది. అనంతరం వారి ప్రోద్బలంతో ఇంట్లోకి వచ్చి ప్రదీప్‌తో మళ్లీ గొడవకు దిగింది. ఈ క్రమంలో పదునైన కత్తి తీసుకొని ప్రదీప్ చాతిలో పొడిచింది. దీంతో ప్రదీప్ కిందపడిపోవడంతో స్థానికులు వెంటనే ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి రామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌హెచ్‌వో రాజు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. దీపావళి పండుగ వేళ జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఇందూను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఇందూ భర్త ప్రశాంత్ పెయింటింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు.

ఎస్‌జీటీలకే కుల గణన డ్యూటీలు

- మధ్యాహ్నం వరకు పాఠశాలలో..
- ఆ తర్వాత సర్వేలో...

బోనకల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు కుల గణన డ్యూటీలు కేటాయించాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులను జారీ చేశారు. ఉన్నత పాఠశాలల్లో పని చేసే టీచర్లను మినహాయించి, ప్రాథమిక బడుల్లో పని చేస్తున్న ఎస్‌జీటీలు, హెచ్‌ఎంలకు సర్వే బాధ్యతలను అప్పగించాలని సూచించారు. ఈ నెల 6 నుంచి 3వారాల్లో కుల గణన విధులను పూర్తి చేసేందుకు తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు రాష్ట్ర వ్యాప్తంగా 80వేల మంది సేవలను వినియోగించుకోనున్నారు ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే (మిగతా 6వ పేజీలో)



ఘనంగా దీపావళి

» ఇరుజిల్లాల్లో నింగినంటిన సంబురాలు..

» నగరంలో టపాసుల మోత..

» ఖమ్మంలో రూ.7 కోట్ల బాణసంచా వినియోగం..


జూలూరుపాడులో

ఖమ్మం సాంస్కృతికం/ కొత్తగూడెం సాంస్కృతికం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకలను ఇరుజిల్లాల ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మట్టి ప్రమిదలలో నూనె దీపాలను ఇంటింటా వెలిగించటంతో ఆనంద వెలుగులు అలుముకున్నాయి. లక్ష్మీదేవి పూజలు, వ్రతాలు పాటించి తమ ఇరుగు పొరుగు వారికి తీర్థ ప్రసాదాలను పంచారు. దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి.. బాణసంచా కొనుగోలుకు అందరూ ఒకేసారి తరలిరావటంతో ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానం కిటకిటలాడింది. రాత్రి సమయంలో బాణసంచా వేడుకను ధూంధాంగా నిర్వహించారు. కాకరొత్తులు, భూచక్రాలు, విష్ణుచక్రాలు, మతాబులు, రాకెట్లు తదితర టపాసులతో హోరెత్తించారు. చిన్నా పెద్దా ఆనందంగా వేడుకలో పాల్గొన్నారు.

నగరంలో రూ.7 కోట్ల వ్యాపారం...

ఖమ్మం నగరంలో దీపావళి వేడుక దద్దరిల్లింది.. చిన్నా పెద్దా బాణసంచా వినియోగానికే మొగ్గు చూపటంతో నగరంలో టపాసుల మోత మోగింది. పండుగకు సుమారు రూ.7కోట్ల విలువైన టపాసులను వినియోగించారని దుకాణదారులు అభిప్రాయ పడుతున్నారు. నగరంలో 122 బాణసంచా దుకాణాలు ఏర్పాటు కాగా ఒకో దుకాణం పరిధిలో సగటున రూ.5లక్షల వ్యాపారం జరిగింది. వీటితోపాటు మరో రెండు హోల్ సేల్ దుకాణాలు సైతం ఏర్పాటుకాగా వాటి ద్వారా కోటి రూపాయల టపాసులను విక్రయించినట్లు తెలుస్తోంది. టపాసుల ఎంఆర్పీపై 70 నుంచి 80 దాకా తగ్గింపు ఆఫర్ ఇవ్వటంతో బాణసంచా ప్రియులు ఎగబడ్డారు. మరో వంక బాణసంచాను గతంలో లేని విధంగా కిలోల చొప్పున కూడా విక్రయించారు.

భద్రాద్రి జిల్లాలో...

భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా ప్రజలు దీపావళి సంబరాలను గురు, శుక్ర వారాల్లో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బొమ్మరిల్లులను ఏర్పాటు చేసి లక్ష్మీదేవిప్రతీమలను ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. పంచదార చిలకలు, మరమరాలు, ఇతర పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం ఊరువాడ, పల్లె, పట్టణాల్లో బాణసంచా కాల్చి దీపావళి పర్వదినాన్ని వేడుకగా నిర్వహించారు. చిన్నా, పెద్ద అనే తేడే లేకుండ కుటుంబసభ్యులంతా కలిసి మతాబులు,కాకర్స్, చుచుబుడ్లు, ఇతర బాణాసంచాలను కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో ప్రజలు దీపావళి సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు.


వేడుకల్లో మేయర్ నీరజ

తప్పిదాలకు తావివ్వొద్దు

» పక్కాగా ఇంటింటి సర్వే

» సర్వే సన్నద్ధతపై నియోజకవర్గ బాధ్యులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణలో భాగంగా ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. దీనికోసం చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇంటింటి కుటుంబ సర్వేపై నియోజకవర్గ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా నివాస ప్రాంతాల్లో ఇళ్ల జాబితాలను రూపొందించాలన్నారు. ఎన్యుమరేటర్ల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సర్వేకు అవసరమైన బ్యాగులు,స్టేషనరీ సామగ్రి సేకరణ పూర్తి చేయాలన్నారు. ఏ ఒక్క ఇంటిని వదిలిపెట్టకుండా పక్కా పరిశీలనతో హౌస్ లిస్టింగ్ చేయాలన్నారు. ముఖ్యంగా మునిసిపల్ పట్టణాల పరిధిలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. సర్వేకోసం ఎన్యుమరేషన్ బ్లాక్‌లోని ప్రతి ఇంటికి క్రమానుగత సంఖ్యను కేటాయించాలని, ఇళ్ల జాబితా పక్కాగా రూపొందితే సర్వే సమగ్రంగా వస్తుందన్నారు. మూడు రోజుల్లోపు హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎక్కడ కూడా డుప్లికేషన్ లేకుండా హౌస్ లిస్టింగ్ చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ జిల్లాలో సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఎన్యుమరేటర్లకు అవగాహన కల్పించాలి

6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి సమగ్ర సర్వే ప్రక్రియపై ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. శిక్షణకు ఏర్పాట్లు చేయాలన్నారు. డేటా నమోదుకు ఆపరేటర్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రక్రియలో తప్పిదాలు జరగకుండా పర్యవేక్షణ అధికారులు అన్ని స్థాయిల్లో సూపర్ చెక్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ముఖ్య ప్రణాళిక అధికారి ఏ.శ్రీనివాస్, డిప్యూటీ జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, అదనపు డీఆర్డీవో నూరుద్దీన్, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు

కుటుంబాల గుర్తింపులో భద్రాద్రిలో కలెక్టర్

ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేసిన జితేష్ వి పాటిల్



కొత్తగూడెం/పాల్వంచ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6 నుంచి ప్రారంభమయ్యే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా శుక్రవారం పాల్వంచ మండలం పూనుకుల గ్రామంలో నిర్వహిస్తున్న కుటుంబాలకు గుర్తింపు కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పాల్గొని ఎన్యుమరేటర్లకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి ఒక్క ఎన్యూమరేటర్ వారికి కేటాయించిన బ్లాక్ ప్రకారంగా ప్రతి ఇంటిని ప్రతి కుటుంబాన్ని గుర్తించాలని, 3వ తేదీ వరకు ఇంటి గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి ప్రతి కుటుంబానికి హౌస్ లిస్టింగ్ స్టికర్‌ను అతికించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర సమాచారాన్ని నింపాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఇంటి నుంచి కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. ఈ సర్వే ఉద్దేశం రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతికి వివిధ సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ అవకాశాలు మెరుగుపర్చడానికి తగిన ప్రణాళికలు తయారు చేయడం, వాటిని అమలు చేయడం ప్రభుత్వ లక్ష్యమని ప్రజలకు తెలియచేసి అందరు ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనేలా చేయాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు సర్వే చేయటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే.విజయభాస్కర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి బి.నారాయణ, పంచాయతీ కార్యదర్శి బి.బాబురావు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజలు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పద్మావతి

ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలకు

న్యాక్ ఏ గ్రేడ్

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ మహిళ డిగ్రి కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి పద్మావతి శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. న్యాక్ టీం ఈనెల 24, 25 తేదీలలో కళాశాలను సందర్శించి మౌలిక వసతులు విద్య పరిశోధన ఫలితాల పైన సంతృప్తి వ్యక్తం చేసారని తెలిపారు. కళాశాలకు ఏ గ్రేడ్ రావడానికి విద్యార్థులు, అధ్యాపకులు పూర్వ విద్యార్థులు, అభివృద్ధి కమిటీ సభ్యులు సహకరించారని తెలిపారు. ఐక్యూఏసీ బాధ్యులు రాకేష్ శ్రీరామ్,వైస్ ప్రిన్సిపాల్ జానకి రామారావు, అధ్యాపకులు బొంద్యాలు, ప్రవీణ్, కృష్ణవేణి, ఇందిర,విద్యా ప్రవీణ, మార్థియన,రాంకుమార్,పద్మ రాణి, చేకూరి రమేష్, రమాదేవి, శ్యామల దేవి, శ్రీనివాస్ రావు, యాకోబు, వెంకన్న, కవిత, పేరెల్లి శ్రీను, రామారావు,చరిత్ర, గాయత్రి, సింధు, శైలజ, సాగరిక, వెంకన్న, దీప్తి, రామారావు లను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఆలయాలకు

కార్తీక శోభ..

» కార్తీకం.. పరమపవిత్రం..

» నేటినుంచి కార్తీక మాసం ప్రారంభం..

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ఖమ్మం నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా శివాలయాలకు శోభ చేకూరింది. నెలంతా భక్తులు ప్రతి సోమవారం ఆలయాలను సందర్శిస్తారు కనుక భక్తుల రాకకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఖమ్మంలోని ప్రాచీన గుంటుమల్లేశ్వర ఆలయం, సుగ్గల వారి తోట శివాలయం, బ్రాహ్మణ బజార్ శివాలయం, పోలీస్ లైన్‌శివ పంచాయతనం తదితర శైవ ఆలయాల్లో ఆకాశ దీపం, కార్తీక దీపోత్సవం, తదితర ప్రత్యేక పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు చేశారు. భక్తులు పరమ పవిత్రంగా భావించే కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభం కానుంది. ప్రతి ఏటా దీపావళి పండుగ అనంతరం కార్తీక మాసాన్నిపాటిస్తారు. ఆధ్యాత్మిక చింతనకు కార్తీక మాసం అత్యంత శ్రేష్టమని ప్రతీతికావటంతో భక్తులు ఈ నెలలో పూజలు , వ్రతాలతోపాటు వివాహాలు, గృహప్రవేశాలు, అయ్యప్పస్వామి దీక్షా ధారణలువంటివి పాటిస్తారు. చంద్రుడు కృత్తికా నక్షత్రంలో ప్రవేశించే రోజునుంచి కార్తీక మాసంగా పరిగణిస్తారు. న కర్తీక సమో మాసో , నకృతేన సమం యుగం, న వేదసదృశ్యం శాస్త్రం, నతీర్థం గంగయా సమమ్... అంటే కార్తీక మాసానికి సాటి వచ్చే మాసం ఏదీ లేదు. సత్యయుగంతో సమానమైన యుగమేమీలేదు, వేదములతో సమానమైన శాస్త్రమేదీ లేదు, గంగానదీ వంటి ఇతరనది ఏదీలేదు..అని అర్థం..

కార్తీకమాసంలో శైవ క్షేత్రాలకు

ఇరుజిల్లాల నుంచి

ప్రత్యేక బస్సులు

ఖమ్మం ఖానాపురంహవేలి/ కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/ మణుగూరు/భద్రాచలం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో శైవ క్షేత్రాలకు ఉమ్మడి జిల్లాలో ఆయా డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుతున్నట్లు ఆయా డిపో మేనేజర్లు శుక్రవారం తెలిపారు. ఈనెల 3, 10, 17, 24 తేదీల్లో పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట, కార్తీక సోమవారం రోజున అన్నవరానికి ఈ బస్సులు నడవనున్నట్లు వారు తెలిపారు. ఆదివారం రాత్రి 7గంటలకు, 8 గంటలకు ఖమ్మం, పాల్వంచ, కొత్తగూడెం డిపో నుంచి బస్సులు బయలుతేరుతాయని ఖమ్మం డీఎం దినేష్‌కుమార్, కొత్తగూడెం డీఎం దేవేందర్‌గౌడ్ తెలిపారు. అరుణాచల గిరిప్రదక్షిణకు నవంబరు 13న రాత్రి కొత్త సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని తెలిపారు. మణుగూరు డిపో నుంచి రాత్రి 8గంటలకు, 9 గంటలకు బస్సులు బయలుతేరుతాయని డీఎం శ్యాంసుందర్ తెలిపారు. మరిన్ని వివరాలకు ఖమ్మం - 9959225958, కొత్తగూడెం - 9959225959, 7382858008, 7382858258, మణుగూరు - 9959225963లో సంప్రదించవచ్చని తెలిపారు. నవంబరు 13న రాత్రి 8గంటలకు భద్రాచలంలో సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరి విజయవాడ మీదుగా శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం(గోల్డెన్ టెంపుల్)లను దర్శింపచేసి మరుసటి రోజు రాత్రి 10గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. 16న తిరి భద్రాచలం చేరుకుంటుదని డిపో మేనేజర్ బి.తిరుపతి తెలిపారు. వివరాలకు 7386326102, 7382856625, 9347797952 సంప్రదించాలన్నారు.

ఘనంగా అన్నదానం..

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): త్రిదండి చినజీయర్‌స్వామి జన్మదినం సందర్భంగా గురువారం ఖమ్మంలోని వికాస తరంగిణి ఆధ్వర్యంలో స్థానిక కాల్వొడ్డు మోతీనగర్‌లో భక్తులకు అన్నదానం నిర్వహించారు. స్వామీజీ ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి ఖమ్మం నగర అధ్యక్షుడుపోలా శ్రీనివాసరావు, 35వ డివిజన్ కార్పొరేటర్ యల్లంపల్లి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో ఐక్యత, మానసికోల్లాసం కోసం

రేపు ఆత్మీయ సమ్మేళనం

» 20 వేల మందికి సరిపడా ఏర్పాట్లు

» ముగ్గురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొంటారు...

» సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిత్యం పని ఒత్తిడితో ఉండే ఉద్యోగులలో మానసిక ఒత్తిడిని తగ్గించి, ఉత్సాహాన్ని, ఐక్యతను పెంచేందుకు ఆదివారం 20 వేల మందితో ఖమ్మంలో సకల ఉద్యోగ ఆత్మీయ సమ్మేళనం, వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని గొల్లగూడెం రోడ్డులోని చెరుకూరి మామిడి తోటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. జేఏసీ భాగస్వామ్య ఉద్యోగుల సంఘ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగుల, గెజిటెడ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సైతం హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. 206 సంఘాలతో జేఏసీ ఏవిధంగా ఏర్పడిందో, అదేవిధంగా పూర్వ వైభవం తీసుకురావడానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఫ్రెండ్లీగా ఉంటోందని గత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సకల ఉద్యోగులను ఐక్యం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉద్యోగ సంఘాలతో చర్చించిందని జేఏసీ నాయకులు కూడా ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఒక డీఏను విడుదల చేసిందని మార్చిలోగా మరిన్ని ప్రయోజనాలను కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులతో అన్ని జిల్లాల్లోనూ వన సమారాధనలు నిర్వహించి ఉద్యోగులతో చర్చించనున్నట్లు దీనిలో భాగంగానే ఖమ్మంలో ఆదివారం వనసమారాధన, ఉద్యోగుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మెన్లు, ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ మేయర్, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌ను ప్రత్యేక ఆహ్వానితులుగా రానున్నట్లు తెలిపారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని ఆరు సెంటర్ల నుంచి ప్రత్యేకంగా బస్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘం ఎస్టీ ఎఫ్ రాష్ట్ర నాయకులు దేవరకొండ సైదులు, నాగిరెడ్డి, టీజీఓ జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి వేలాద్రి, టీఎన్జీవో నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, కొణిదెన శ్రీనివాస్, జడ్ ఎస్ జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులే...

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నేలకొండపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులను అంతం చేస్తామని ప్రగల్భాలు పలికిన వారు కాలగర్భంలో కలిసిపోయారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామంలో శుక్రవారం కనకబండి సీతారాములు అధ్యక్షతన జరిగిన పార్టీ వందేళ్ల సన్నాహక సభలో కూనంనేని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

మొదటిసారిగా తెలంగాణలో పార్టీ 100సంవత్సరాల సభను జరుపుకొంటున్నామన్నారు. కాలక్రమేణా కమ్యూనిస్టుల ప్రాబల్యం కొంత తగ్గిన మాట వాస్తవమైనప్పటికీ, భూమి ఉన్నంతవరకు, దోపిడీ ఉన్నంతవరకు కమ్యూనిస్టులు బతికే ఉంటారన్నారు. ఈరోజు జనంలోకి వచ్చి ఎందరో, ఎన్నో మాయ మాటలు చెపుతున్నారని, వాళ్లంతా తెల్లారేసరికి ఏ పార్టీలో ఉంటారో తెలియదన్నారు. నీతిగా, నిజాయితీగా ప్రజల హక్కుల కోసం పోరాడేది ఒక్క కమ్యూనిస్టులేనన్నారు. సీపీఐ పార్టీకి ప్రజాసేవనే స్వార్థం తప్ప ఎటువంటి స్వార్థం లేదన్నారు. తప్పును ప్రశ్నించే వాళ్లు, న్యాయం కోరుకునే వాళ్లు మాత్రమే కమ్యూనిస్టులుగా, ముఖ్యంగా సీపీఐలో ఉంటారన్నారు.

రాష్ట్రంలో, దేశంలో కమ్యూనిస్టులు లేకుండా చేస్తామన్న ప్రబుద్ధులు అడ్రస్ లేకుండా కాలగర్భంలో కలిసిపోయారన్నారు. ఆనాటి హిట్లర్‌కు నేటి మోదీకి ఏం తేడా లేదన్నారు. మోదీ హిట్లర్ లాగా, అమిత్‌షా ముస్సోలినీలా మాట్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, నాయకులు మహ్మద్ మౌలానా, శ్రీనివాస్, బాగం నర్సింహారావు, శ్రీనాథ్‌రెడ్డి, పోలంపల్లి నారాయణ, ఉపేందర్, గురవమ్మ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


సభకు హాజరైన ప్రజలు, కార్యకర్తలు

ప్రమాదాల నివారణకు పోలీసుల వినూత్న చర్యలు

» పాట్రోలింగ్ కార్, హెడ్ కానిస్టేబుల్ చిత్రాలతో ఫ్లెక్సీల ఏర్పాటు

చంద్రుగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఉన్న మూలమలుపుల వద్ద ప్రమాదాల నివారణకు ఎస్ఐ గంజి స్వప్న సిబ్బందితో కలిసి వినూత్న చర్యలు చేపట్టారు. చంద్రుగొండ మండల పరిధిలో సుమారు పది కిలో మీటర్ల మేర ఉన్న జాతీయ రహదారిలోని మూలమలుపుల వద్ద తరచు జరిగే ప్రమాదాలతో ప్రాణ, ఆస్తినష్టం సంభవిస్తుంది. కాగా ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'అస్తవ్యస్తంగా జాతీయ రహదారి, మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరుతున్నా పట్టించుకోని అధికారులు' అనే కథనం వెలువడింది. ఆ సమయంలో ప్రమాదాలకు మరో కారణంగా ఉన్న యూటర్నుల వద్ద చెట్లను ఆయా గ్రామాల పంచాయతీ అధికాలు తొలగించారు. ఇప్పుడు పోలీసులు సైతం స్పందించి మూలమలుపుల వద్ద పాట్రోలింగ్ వాహనంతో పాటు యూనిఫాంతో ఉన్న హెడ్ కానిస్టేబుల్ చిత్రంతో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు దీంతో పాటు రాత్రి సమయాల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించేందుకు లైట్లు సైతం అమర్చారు. ఇటువంటి ఏర్పాట్లు వల్ల వాహనదారులు అప్రమంతం అవుతారని ఎస్ఐ స్వప్న తెలిపారు.


పాట్రోలింగ్ వాహన ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన దృశ్యం

ఎస్‌జీటీలకే కుల గణన డ్యూటీలు

(5వ పేజీ తరువాయి)

ఎస్‌జీటీలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బడులను నడిపి, పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టించి వారిని ఇంటికి పంపించాలి. ఆ తరువాత టీచర్లు కుల గణన విధుల్లో పాల్గొనేలా దిశానిర్ధేశం చేశారు.

ప్రాథమిక పాఠశాలల్లో పని చేసే టీచర్లకు వెంటనే శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించి వారిని సన్నద్ధం చేయాలని జిల్లా, మండల విద్యాశాఖాధికారులకు తగు మార్గదర్శకాలను పంపారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

ఆల్లపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం డీఎస్సీ విడుదల చేయడంతో ఆల్లపల్లి మండలానికి చెందిన విజయ్, ధనలక్ష్మి ఇద్దరు నూతన ఉపాధ్యాయులుగా కొలువులు సాధించారు. శుక్రవారం మర్కోడు గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. యువత విద్య, క్రీడా రంగాల్లో ఆసక్తి చూపాలని పిలుపునిచ్చారు.

రెండోవిడత చేప పిల్లలకు గ్రీన్ సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

272 పెద్దచెరువుల్లో 80నుంచి 100మిల్లీమీటర్ల సైజు కలిగిన 1.07కోట్ల చేపపిల్లల సరఫరాకు ప్రభుత్వం అనుమతించింది. ఆ మేరకు రూ.1.85కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసింది.

వైరా రిజర్వాయర్‌లో మొదటి విడతలో 7.18 లక్షల చేపపిల్లలు విడుదల చేయగా, రెండోవిడతలో అంతే మొత్తంలో చేపపిల్లలను పోయనున్నారు.

పాలేరులో మళ్లీ 6.65లక్షలు, లంకాసాగర్‌లో రెండోవిడతలో ఆరులక్షలు, బేతుపల్లిలో మళ్లీ 3.30లక్షల చేపపిల్లలను విడుదల చేయనున్నారు. వీటితోపాటు 272పెద్ద చెరువుల్లో రెండోవిడత చేపపిల్లలను విడుదల చేస్తారు.

మంత్రి పొంగులేటి కృషితోనే...

మామిడి వెంకటేశ్వర్లు, డీఎఫ్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు



జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతోనే రాష్ట్రం మొత్తంమీద ఒక్క ఖమ్మం జిల్లాకే రెండోవిడత ఉచిత చేపపిల్లల సరఫరాకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని జిల్లా మత్స్యసహకార సంఘం(డీఎఫ్‌సీఎస్) అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తమ జిల్లా సంఘం మత్స్యకారులతో కలిసి తాము చేసిన విజ్ఞప్తికి పొంగులేటి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. దీనివల్ల వేలాది మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మంత్రి పొంగులేటికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపయోగంగా మార్కెట్ యార్డు

» తొమ్మిదేళ్లుగా నిలిచిన కొనుగోళ్లు

» దళారుల బారిన రైతులు

టేకులపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంటలను అమ్ముకోవడానికి మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రం టేకులపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తొమ్మిదేళ్లుగా ఎలాంటి కొనుగోళ్లు నిర్వహించక పోవటంతో యార్డు నిరుపయోగంగా మారింది. రైతులకు మేలుచేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నిర్మించిన మార్కెట్ యార్డులు అధికారుల ఉదాసీనత వల్ల మూలనపడ్డాయని రైతులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కొనుగోళ్ల నిర్వహణలేకపోవడం వల్ల దళారుల భారీనపడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డు బాటసారులకు, పశువుల కాపరులకు ఉపయోగపడుతుందే తప్ప రైతులకు ఉపయోగ పడడంలేదు. మార్కెట్ గోదాం పిచ్చిమొక్కల మధ్య దర్శనమిస్తోంది. కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డు కనీసం ఒక్క రైతుకు కూడా ఉపయోగపడటంలేదు. మార్కెట్ యార్డు నిరుపయోగంగా ఉండటాన్ని సాకుగా తీసుకొన్న వ్యాపారులు మండల వ్యాప్తంగా ధాన్యం కాంటాలు, చిల్లర పత్తికౌంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టకొస్తున్నాయి. మార్కెటింగ్ నిబంధనలకు విరుద్ధంగా ధరలు, తూకాల్లో మోసంచేస్తూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు.

ఈ ఏడాది మండలంలో సుమారు 40వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అతివృష్టి, అనావృష్టి వల్ల పత్తి సాగు ఆశించినమేర దిగుబడులు రావని రైతులు ఆందోళనచెందుతున్నప్పటికీ వ్యాపారులు రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. మండల కేంద్రం టేకులపల్లితో పాటు సులానగర్, ముత్యాలంపాడు, సీతారాంపురం, బొమ్మనపల్లి, బోడు, కొప్పురాయి, కోయగూడెం, పంపత్‌నగర్ తదితర గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో పత్తిచిల్లర కౌంటర్లు ఏర్పాటు చేశారు. మార్కెట్ యార్డులో కోనుగోళ్లు లేకపోవడంతో చిల్లర కౌంటర్ల వద్ద వ్యాపారులకు పత్తిని అమ్ముకొంటున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు రైతులను మోసం చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మార్కెట్ యార్డులో కొనుగోళ్ల ప్రారంభించాల్సి ఉంది.


పిచ్చిమొక్కల నడుమ గోదాం

ఆఫ్రీన్‌కు ఖమ్మం సీపీ అభినందన



ఖమ్మంక్రైం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుంటూరులో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన 35వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాపింయన్‌షిప్ పోటీల్లో ఖమ్మం యూనిట్ హోంగార్డు రహీం కుమార్తె షేక్ ఆఫ్రిన్ మూడోస్థానంసాధించింది. ఈసందర్భంగా శుక్రవారం సీపీ కార్యాలయంలో సీపీ సునిల్‌దత్‌ను ఆఫ్రిన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెను సీపీ శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు వరుణ్‌తేజ



దుమ్ముగూడెం నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమపాఠశాల పదోతరగతి విద్యార్థి పూసం వరుణ్‌తేజ వాలీబాల్ అండర్-17 విభాగంలో జాతీయస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలకు తెలంగాణా రాష్ట్రం నుంచి ఎంపికయ్యాడు. ఈనెల 5, 6, 7 తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలో జరిగే నేషనల్ మీట్‌లో పాల్గొంటాడు. కొత్తగూడెంలో జిల్లా స్థాయి, పెద్దపల్లిలో రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడి ఎంపికయ్యాడు. వరుణ్‌తేజను హెచ్‌ఎం నర్సింహారావు, డిప్యూటీ వార్డెన్ పాయం వెంకటరత్నం సిబ్బంది అభినందించారు.

నేటినుంచి కేయూ వర్సిటీ అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు

యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్



పోటీల వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధి అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు శని, ఆదివారాలలో నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. రవికుమార్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలలోని డిగ్రీ, పీజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఇంటగ్రేటెడ్ కళాశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో మొదటి సారిగా ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఆధ్వర్యంలో జరనున్న పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాసరావు, అధ్యాపకులు పి. కోటీ, ఎటిబిటి. ప్రసాద్, ఎ. వీరన్న, వెంకట్, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సోషలిస్ట్ సమాజ సాధనే నిజమైన నివాళి

- మాస్‌లైన జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు
- సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ కార్యాలయంలో అమరవీరుల సభ



మాట్లాడుతున్న మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సోషలిస్ట్ సమాజాన్ని సాధించడమే అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పెట్టుబడిదారీ దోపిడీ సమాజాన్ని ఓడించి, కార్మిక, కర్షక, కష్ట జీవులు, మహిళలకు సమాన హక్కులను సాధించడే అమరవీరులకు అర్పించే నివాళులని పేర్కొన్నారు. శుక్రవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడారు. దేశంలో జరుగుతున్న దోపిడీ విధానానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వేలాది మంది విప్లవకారులను ప్రభుత్వం చంపేస్తోందని ఆరోపించారు. రైతులకు సరైన భరోసా ఇవ్వటంలో ప్రభుత్వాలు విఫలం చెందటంతో రైతుఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆరోపించారు. విప్లవోద్యమంలో తరమిల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర పుల్లారెడ్డి, రాయల సుభాష్‌చంద్రబోస్, డీఈ కృష్ణ, కొల్ల వెంకయ్య, కానూరి వెంకటేశ్వరరావు, పంచాది నిర్మల, జంపాల ప్రసాద్, జార్జిరెడ్డి, పైలా వాసుదేవరావు, విక్రమ్, బత్తుల వెంకటేశ్వరరావు, నీలం రామచంద్రయ్య, పోట్ల రామనర్సయ్య, భోగ శ్రీరాములు, గడ్డం వెంకట్రామయ్య, దర్శన్న, బాటన్న, ఎల్లన్న, రాయల చంద్రశేఖర్, సుశేన,చింతాలక్ష్మీ, వల్లూరు వెంకయ్య, పొట్లపల్లి శ్రీశైలం ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, జీ రామయ్య, అర్జున్‌రావు, ఝాన్సీ, కోలేటి నాగేశ్వరరావు, లలిత, మంగతాయి, పాశం అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అమర వీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

రేపు కాశయ్య, నారాయణల విగ్రహాల ఆవిష్కరణ

- గురుదక్షిణ ఫౌండేషన్ ప్రాంగణంలో ఏర్పాటు
- హాజరుకానున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి, భట్టి



మాట్లాడుతున్న సభ్యులు ప్రసాద్

ఖమ్మంరూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మాజీ శాసన సభ్యులు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గురుదక్షిణ వ్యవస్థాపకుడు చేకూరి కాశయ్య, గురువులకే గురువు అయిన ఎస్‌వి. నారాయణల విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించనున్నారు. రూరల్ మండల పరిధిలోని పోలేపల్లి పరిధిలోని గురుదక్షిణ ఫౌండేషన్ ప్రాంగణంలో వీటిని ఏర్పాటు చేసినట్లు గురుదక్షిణ ఫౌండేషన్ అధ్యక్షులు గంగవరపు శంకరయ్య, ప్రధాన కార్యదర్శి చావా సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. ౧ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. విగ్రహాలతోపాటు ఎస్‌వి.నారాయణ మెమోరియల్ గ్రంథాలయం, దుగ్గినేని రామనాధరావు భవన్ ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. అంతేకాక మహిళాభివృద్ధికి కుట్టు శిక్షణాకేంద్రం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గురుదక్షిణలో అన్ని వర్గాల వారికి సహాయం అందిస్తామన్నారు. వాటితో పాటు మరికొన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటి సీఎం మల్లు భట్టీ విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూగృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ విగ్రహల ఆవిష్కరిస్తారని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎమ్మెల్యేలు, పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో అధ్యక్షులు గంగవరపు శంకరయ్య, కార్యదర్శి చావా సత్యనారాయణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ కల్లూరు ఎస్ఈ ఎవరో?



తెరుచుకోని కార్యాలయం

కల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) జలవనరులశాఖ కల్లూరు సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈగా పని చేసిన ఆనంద్‌కుమార్ ఉద్యోగ విరమణ చేసి మూడు రోజులు గడిచింది.. నేటికీ ఆ స్థానంలో ఎవరిని నియమించని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ శాఖల్లో ఏ అధికారి ఉద్యోగ విరమణ చేసినా.. సత్వరమే ఉన్నత అధికారులు స్పందించి సదరు కార్యాలయంలో అందుబాటులో ఉన్న మరో అధికారిని నియమించి బాధ్యతలు అప్పగిస్తారు.. కానీ కల్లూరు సర్కిల్ కార్యాలయంలో పర్యవేక్షక ఇంజనీర్ ఆనందర్‌కుమార్ ఉద్యోగ విరమణ చేయగా నేటివరకు ఆయన స్థానంలో ఇతర అధికారిని నియామించక పోవటం ఆశాఖ ఉన్నత అధికారులు పనితీరుకు నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ జాప్యంతో శుక్రవారం ఎస్సీ కార్యాలయం ఛాంబర్ తెరుచుకోలేదు. ఈ సర్కిల్ పరిధిలో కల్లూరు, మధిర, సత్తుపల్లి డివిజన్లు విస్తరించి ఉండగా వివిధ స్థాయిలో 150 మందికి పైగా అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి కల్లూరు సర్కిల్‌లో పర్యవేక్ష ఇంజనీరింగ్ అధికారిని నియమిస్తూ ఆదేశాలు జారి చేయాల్సిన అవసరం ఉంది.

బొగ్గు ఉత్పత్తి ఇల్లెందు ఏరియా ప్రథమస్థానం

జీఎం జాన్ ఆనంద్



ఇల్లెందుటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇల్లెందు ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 139శాతంతో అధిగమించి సింగరేణిలోనే ఇల్లెందు ఏరియా ప్రథమస్థానంలో నిలిచింది. ఈ వివరాలను గురువారం ఏరియా జీఎం జాన్ ఆనంద్ వెల్లడించారు. ఇల్లెందు ఏరియాకు అక్టోబరులో నిర్ధేశించిన 3.12లక్షల టన్నులకు 4.34లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు చెప్పారు. ఈ బొగ్గును వివిధ ప్రాంతాలకు రవాణా చేశామని, అక్టోబరులో 55రేకుల బొగ్గును రవాణా చేశామన్నారు. సామాజిక బాధ్యతగా ఏరియాలో పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం గిరిధరరావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

కులగణనతో రోల్‌మోడల్‌గా తెలంగాణ

ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కులగణనతో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్ నిలవబోతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. కామేపల్లి రైతుల వేదికలో పదిమందికి కల్యాణలక్ష్మి, 69మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈనెల6న నుంచి కులగణన ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుగుందని అన్నారు. ప్రజలు అందరు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని చేయాలన్నారు. త్వరలో ఇందిరమ్మ కమిటీ ద్వారా అర్హులైన పేదలను గుర్తించి ఇళ్లను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ సుధాకర్, డీసీసీబి డైరెక్టర్ మేకల మల్లిబాబు, పీఏసీఎస్ చైర్మన్లు పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హన్మంతరావు, వైస్ చైర్మన్ రాంబాబు, గింజల నర్సింహారెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, జగన్నాథరెడ్డి, బొడ్డు లక్ష్మీనారాయణ, ఆరెం రవి, డీఎస్, మేకలపోతుల మహేష్, దేవండ్ల రామక్రిష్ణ, దొడ్డ వేణు మాజీ సర్పంచులు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఐదు పంచాయతీల విలీనంపై ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం

భద్రాచలం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): గతంలో భద్రాచలం మండలంలో అంతర్భాగంగా ఉన్న ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపే అంశంపై టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు జర్నలిస్ట్ జంగిలి నవీన్ వినతి పత్రం అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో కోదండరాం నివాసంలో ఆయనను కలిసి ఎటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచుకలపాడు, పురుషోత్తపట్నం పంచాయతీలను తెలంగాణలో కలిపే అంశంపై వినతి పత్రం, రూట్‌మ్యాప్ అందజేశారు. భద్రాచలం పట్టణవాసులు, సరిహద్దులో ఉన్న ఐదు పంచాయతీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

ఎస్ఎల్ఎస్‌కు సమ్మె నోటీసు

దుమ్ముగూడెం,నవంబరు1(ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచని పక్షంలో ఈనెల15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని దుమ్ముగూడెం శ్రీలక్ష్మీ సరస్వతి హైడల్ పవర్ ప్రాజెక్టు(ఎస్ఎల్ఎస్) యాజమాన్యానికి సీఐటీయూ అనుబంధ సంఘ కార్మికులు శుక్రవారం సమ్మె నోటీసు అందించారు. వేతన ఒప్పంద గడువు ముగిసి 18 నెలలు కావస్తున్నా జీతాలు పెంచకుండా తీవ్రజాప్యం చేస్తున్నారని టీయూఈఈయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని రమేష్ తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి, నాయకులు వంశీకృష్ణ, శ్రీనివాస్, సతీష్, ప్రకాశ్, నాగేశ్వరావు, నగేష్, నరేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



గోపి మృతదేహం

వైరా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు గ్రామంలో దీపావళి పర్వదినాన విషాదం చోటుచేసుకుంది. ఆగ్రామానికి సమీపంలో వైరా నదిపై ఉన్న చెక్‌డ్యాం నీటిలో పడి తేళ్లపుట్ట గోపి(24)అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి తండ్రి తేళ్లపుట్ట దేవదాస్ తన కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ వైరా పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. గురువారం దీపావళి పండుగ వేళ గోపి మరో ఆరుగురితో కలిసి ఆగ్రామంలోని పాఠశాల ఆవరణంలో కొంతసేపు వాలీబాల్ ఆడారు. ఆతర్వాత గోపి మిగిలిన ఆరుగురితో కలిసి గరికపాడు సమీపంలోని వైరా నదిపై ఉన్న చెక్‌డ్యాం వద్దకు వెళ్లి ఈతకొట్టే సమయంలో మృతిచెందాడు. నీటిలోని బురదలో కూరుకుపోయిన గోపిని మరికొంతమందితో కలిసి ఒడ్డుకు చేర్చిన మిగిలిన ఆరుగురు ఆ తర్వాత స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు చికిత్స కోసం తీసుకువెళ్లారు. ఆవెంటనే వైరాలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే గోపి మృతిచెందాడని డాక్టర్ నిర్ధారించారు. అయితే ఆసమయంలో ఈ ఆరుగురు కూడా కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వక పోవడంపై పలు అనుమానాలు రేకెత్తించాయి. దాంతో శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మృతుడి పెదనాన్న తేళ్లపుట్ట రవి డయల్ 100కు ఫిర్యాదు చేశారు. ఆవెంటనే వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ గరికపాడుకు చేరుకొని గోపి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పరీక్షలు చేయించారు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో మునిగి యువకుడు..

భద్రాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరిలో మునిగి గురువారం ఒకరు మృతి చెందారు. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు గోదావరిలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో లోతును అంచనా వేయలేక చలపతి (23) అనే యువకుడు గోదావరిలో మునగగా అతనిని రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ ఆచూకీ లభించలేదు దీంతో స్థానిక గజ ఈతగాళ్లు, అగ్నిమాపకసిబ్బంది.అతని ఆచూకీ కోసం ప్రయత్నించగా సాయంత్రం చలపతి మృతదేహంల భ్యమైంది. ఒడిశాలో పని చేసుకుని రామయ్య దర్శనం కోసం వచ్చి గోదావరిలో స్నానం చేసే సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

మహిళ అనుమానాస్పద మృతి

భర్తే హత్య చేశాడంటూ మృతురాలి తండ్రి ఫిర్యాదు



రమారెడ్డి మృతదేహం

నేలకొండపల్లి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. భర్తే చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఈ ఘటన రాజేశ్వరపురం పరిధిలోని మధుకాన్ షుగర్స్ క్వార్టర్స్‌లో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. ఖమ్మం రూరల్ మండలం మద్దివారిగూడేనికి చెందిన మద్ది నర్సిరెడ్డి కుమార్తె రమారెడ్డి(30)కి కూసుమంచి మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన కొత్తా ముకుందరెడ్డి కుమారుడు జితేందర్‌రెడ్డితో దాదాపు 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి పాప, బాబు ఉన్నారు. జితేందర్‌రెడ్డి మధుకాన్ షుగర్స్‌లో పని చేస్తూ, ఫ్యాక్టరీ ఇచ్చిన క్వార్టర్‌లో ఉంటున్నాడు. కొంతకాలంగా జితేందర్‌రెడ్డి భార్య రమారెడ్డిని కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం రమారెడ్డి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న నేలకొండపల్లి పోలీసులు శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా మృతదేహంపై తీవ్ర గాయాలుండటంతో, రమారెడ్డిది ఆత్మహత్య కాదని హత్యని అనుమానిస్తున్నారు. భర్తే, భార్యను చంపి గడ్డి మందు పోసినట్లుగా తెలుస్తున్నది. ఈమేరకు మృతురాలి తండ్రి మద్ది నర్సిరెడ్డి వరకట్నం కోసమే తన కుమార్తెను హత్య చేసినట్లు నేలకొండపల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.. నేలకొండపల్లి పోలీసులు హత్య కేసును నమోదు చేయనున్నట్లు తెలుస్తున్నది.

బాణసంచా కాలుస్తుండగా విద్యార్థి కంటికి గాయం

కరకగూడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దీపావళి సందర్భంగా బుధవారం బాణసంచా కాలుస్తుండగా మండల కేంద్రానికి చెందిన గోల్డ్‌షాపు చారి కుమారుడుకు ప్రమాదవశాత్తు కంట్లో మెరుగులు పడ్డాయి. దాంతో బాలుడు కన్నుకు తీవ్రమైన గాయం అయింది. కుటుంబ సభ్యులు మణుగూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చేర్పించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

కారేపల్లి నవంబరు1:(ఆంధ్రజ్యోతి)స్థానిక మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూలు వైరా గర్ల్స్-1ఖాళీగా ఉన్న తెలుగు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగానికి అర్హత కలిగిన అభ్యర్థులనుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎంశైలజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో డిగ్రి, బీఈడీ, పీజీ ఉండాలన్నారు.

ఊటుకూరు మేజర్ కాల్వకు గండి



కాల్వకు పడిన గండి

కల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరు మేజర్ కాల్వకు (చిన్నకోరుకొండి- దారుగబంజర గ్రామాల మధ్యన) గురువారం రాత్రి గండి పడింది. సదరు కాల్వపై విధులు నిర్వహిస్తున్న లస్కర్ కల్లూరు నీటిపారుదల శాఖ అధికారులకు గండి పడిన సమాచారం అందించాడు. మరో వైపున ఈ కాల్వ పరిధిలో గల దారుగాబంజర రైతులు యస్‌కె ఖాదర్, మండడపు మురళి, రాటకొండ చిన్నపుల్లయ్య, ఉన్నం రాజ, ఎస్‌కె మీరాలు ముందుకు వచ్చి సదరు గండిని తాత్కాలికంగా పూడ్చివేశారు. నీటిపారుదలశాఖ ఇంజనీర్ సాయిరామ్ పర్యవేక్షణలో రైతులు తమ వంతుగా ఎక్సకవేటర్‌ని వినియోగించి కాల్వపై గండి ప్రదేశంలో గ్రావెల్ పోసి నీటి సరఫరాకు అంతరాయం లేకుండ గండిని పూడ్చివేశారు. ఈ కాల్వ పరిధిలో మిరప సాగుకు నీటి ఆవశ్యకత ఉంది.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్య



చాణక్య (ఫైల్)

ఏన్కూరు/ఖమ్మం క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం లచ్చగూడెం గ్రామానికి చెందిన జబ్బా హనుమంతు (28) తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, సీతమ్మ అనారోగ్యంతో పదేళ్ల క్రితం మృతిచెదారు. అన్న కిరణ్ ఖమ్మంలో షాపులో పనిచేస్తున్నాడు. ఒంటరిగా ఉంటున్న హనుమంతు ట్రాలీ డ్రైవర్‌గా, వంటలు చేయడతో పాటు రకరకాల కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొన్ని నెలల నుంచి అడవి మద్దులపల్లిలో ఓ ప్రైవేటు నర్సరీలో పనిచేస్తున్నాడు. దీపావళి సందర్భంగా స్వగ్రామం లచ్చగూడెం వచ్చాడు. స్నేహితులతో కలిసి మద్యం సేవించాడు. తన ఇంటి లో శుక్రవారం ఉదయం ఫ్యాన్‌కు వేలాడుతుండడాన్ని చూసి పక్కింటి వారు పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి అ న్న కిరణ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్ రఫీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పురుగుమందు తాగి యువకుడు

ఖమ్మం క్రైం (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం కొణిజర్ల మండ లం తనికెళ్లకు చెందిన చల్లా నాగేశ్వరరావుకు కూతురు, కుమారుడున్నారు. కుమార్తె నవ్యకు వివాహమై ఒక కుమారుడున్నారు. దీపావళి పండుగ కావడంతో కుమార్తెను, మనుమడిని తన ఇంటికి తీసుకువచ్చాడు. మేనల్లుడితో ఆడుకుంటున్న నాగేశ్వరరావు కుమారుడు వెంకట చాణక్య (23) చిన్నారితో గొడవపడ్డారు. దీంతో తండ్రి నాగేశ్వరరావు కుమారుడిని మందలించారు. దీంతో మనస్తాపం చెందిన చాణక్య తన ద్విచక్ర వాహనంపై ఖమ్మం వచ్చి కాల్వొడ్డులో లారీ అడ్డా వద్ద పురుగుమందు తాగి ఓ లారీలో పడుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన సెక్యూరిటీ గార్డు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతోవారు వచ్చి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. దీంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

డ్వాక్రా డబ్బు చెల్లించలేక మహిళ..

డ్వాక్రా డబ్బులు చెల్లించలేక ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినసంఘటన బుధవారం అర్ధరాత్రి ఖమ్మం లో జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం కోదాడకు చెందిన హాజీరత్ పాషా, సాధిక్యాలు నగరంలోని పాత మునిసిపాలిటీ సమీపంలో కొంతకాలంగా నివసిస్తున్నారు. హాజీరత్‌షాషా ఓ మొబైల్‌షాపులో మెకానిక్‌గా పనిచేస్తుండగా భార్య సాదిక్యా చిన్న వ్యాపారాలు చేస్తూ జీవిస్తున్నారు. కోదాడలో సాధిక్యా డ్వాక్రా సంఘం లీడర్‌గా ఉంది. ఆసంఘం ద్వారా గతంలో ఓ బ్యాంకు నుంచి రూ.4లక్షల రుణం తీసుకుంది. ఈనేపథ్యంలో తీసుకున్న లోను వాయిదాలు చెల్లించలేకపోవడంతో బ్యాంకు అధికారులు డ్వాక్రా సంఘంలోని తోటి మహిళనుంచి వత్తిడి చేశారు. దీంతో మదనపడుతూ బుధవారం రాత్రి ఇంటిలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి కుమారుడు, కుమారున్నారు. ఈఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

బోనకల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్వోబీ దిగువ ప్రాంతం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోనకల్‌కు చెందిన పాలకుర్తి వెంకట్రాములు బైక్ పై మనుమడు, మనుమరాలును ఎక్కించుకొని రావినూతలకు వెళ్లి వస్తున్నాడు. ఇదే క్రమంలో బోనకల్ నుంచి వైరా వైపునకు వెళ్తున్న ఆటో బైక్‌ను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం పై నుంచి కింద పడ్డ వెంకట్రాములు, అతడి మనుమరాలు ఏడేళ్ల పూజితలకు తీవ్ర గాయాలు కాగా, ఐదేళ్ల మనువడు స్రవంత్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఆటో డ్రైవర్ శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షత గాత్రులకు 108 సిబ్బంది మనోహర్, వెంకట్రావులు ప్రథమ చికిత్స చేసి ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వలనే రోడ్డు ప్రమాదం జరిగిందని స్థానికులు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

అన్నపురెడ్డిపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయిగూడెం గ్రామ శివారులో కోడిపందేలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు అన్నపురెడ్డిపల్లి పోలీసులు పందేల శిబిరంపై దాడి చేశారు. ఆ సమయంలో పందేలు వేస్తున్న 12 మందిలో రామకృష్ణ, వెంకటేశ్వరావు, రాఘవులు, మోహన్ స్వామి అనే నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొగా, మరో ఎనిమిది మంది పరారయ్యారు. పోలీసులు అదుపులో ఉన్నవారి నుంచి మూడు బైక్లు, ఏడు సెల్‌ఫోన్లు, రూ 1200, రెండు కోడి కత్తులు, మూడు కోడి పుంజులను స్వాధినం చేసుకొని, వీరిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.



నగరంలో నేడు విద్యుత్ కోత

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని మంచుకొండ విద్యుత్ సెక్షన్‌లో పరిశ్రమల ప్రాంతంలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ కోతలు అమలు చేస్తున్నట్లు ఏడీఈ సంజీవ్ శుక్రవారం ప్రకటించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నాం 3 వరకు విద్యుత్ కోతలు ఉంటాయని ప్రకటించారు. ఐడీఏ ప్రాంతం, జయనగర్ కాలనీ, బాలపేట, పాండురంగాపురం, అమరావతినగర్, విద్యానగర్, కైకొండాయిగూడెం, గణేష్ టౌన్ షిప్, యూపీహెచ్ కాలనీ, బాలాజీ నగర్, ప్రశాంతినగర్‌లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	38రూ.
వంకాయ	48
గుత్తి వంకాయ	50
బీరకాయ	54
పచ్చిమిర్చి	58
కాకరకాయ	54
బెండకాయ	28
పొట్లకాయ	48
దోసకాయ	68-58
గోరుచిక్కుడు	68
నాటుచిక్కుడు	140
క్యాబేజీ	30
దొండ	36-46
సొరకాయ	36
క్యారెట్	58
క్యాప్సికం	88
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	50-60
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	165
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	వెనమ్
శ్రీనివాస:	లగ్గం, వెట్టయాన్
సాయిరాం:	విశ్వం
కేపీఎస్:	వెనమ్
తిరుమల:	దేవర

సీసీ రోడ్లు,డ్రెయినేజీ సమస్యలు

డివిజన్ విజిట్

- చెరువు అలుగు కాలువతో వర్షాకాలం ఇబ్బందులు
- కరెంట్ పెద్ద స్తంభాలతో ఆగిన ఇళ్ల నిర్మాణం
- కోతులు, కుక్కలు బెడద తీవ్రం
- ఆరో డివిజన్‌లో ప్రజల ఆర్తనాదాలు

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు1(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని ఆరోడివిజన్‌లో కనీస అవసరాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ ప్రజలకు కనీస అవసరాలైన సీసీరోడ్లు, డ్రెయినేజీ సమస్యల పూర్తిస్థాయిలో లేకపోవటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పటంలేదు. డివిజన్ పరిధిలోని సాయి బాబాఆలయం, కృష్ణుడిగుడి భక్తులతో ఆధ్యాత్మికత వెల్లువిరుస్తుంది. డివిజన్ పరిధిలోని ప్రశాంతినగర్, గతంలో ఉన్న పలు కాలనీలంటిని కలిపి కొత్తగా ఖానాపురం కొత్తకాలనీగా ఏర్పాటు చేశారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు పూర్తిస్థాయిలో లేకపోవటంతో వర్షపు నీరు. ఇళ్లల్లో వాడుకున్న నీరు రోడ్లపైకి చేరుతోంది. ఫలితంగా పాదచారులు నడిచే పరిస్థితి లేకుండా ఉంది. డివిజన్ పరిధిలో ఖానాపురం ఊరచెరువు అలుగు కాలువ ఉండటంతో ఈ కాలువకు ఆనుకోని ఉన్న పలు ప్రాంతాలకు కార్పొరేషన్ అధికారులు అనుమతులు రద్దు చేశారు. ఇళ్ల నిర్మాణాలు అరకొరగానే ఉన్నాయి.

ప్రధాన సమస్యలు

ఇల్లెందు ప్రధాన రహదారి నుంచి కృష్ణుడి గుడికి వెళ్లె రహదారి ఇరుకుగా ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో పెద్దపెద్ద కరెంట్ స్థంభాలు గతంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో కార్పొరేషన్ అధికారులు ఇంటి నిర్మాణాలకు అనుమతులు నిలిపివేశారు. కాని కొందరు అనుమతులు లేకుండానే ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి కరెంట్, ఇంటి నెంబర్లను అనధికారికంగా తీసుకున్నట్లు విమర్శలు వినపడుతున్నాయి. ప్రశాంతినగర్‌లో ఉన్న ఓప్రవేటు పాఠశాల కారణంగా పాఠశాల ఆవరణ నుంచి 500ల మీటర్ల వరకు కార్పోరేషన్ అధికారులు స్కూల్ జోన్ పరిధి అని గుగుల్ మ్యాప్‌లో చూపిస్తుండటంతో పలు ఇంటినిర్మాణాలు ఆగిపోయాయి. డివిజన్ పరిధిలోని పలు కాలనీల పరిధిలో

> **డివిజన్ ముఖ చిత్రం**
>
> **డివిజన్ పరిధిలో ప్రాంతాలు:**
>
> ప్రశాంతినగర్, కృష్ణుణిగుడి ప్రాంతం, రస్తోగినగర్, కల్లూరునగర్, రాంనగర్, ఆదిత్యనగర్, గణేష్‌నగర్, తురుణివాటర్ ప్లాంట్ ప్రాంతం, కందిరాజ్‌నగర్, ముత్యాలమ్మ రోడ్ కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, మసీద్‌రోడ్, మహేనగర్, కాలనీలు ఉన్నాయి.
>
> జనాభా: 9వేలజనాభా, ఓటింగ్ 5200
>
> రేషన్‌షాప్‌లు: ఒకటి, అంగన్‌వాడీ కేంద్రం ఒకటి.

కనీస అవసరలైన రోడ్లు, డ్రెయినేలు పూర్తిగా లేకపోవటంతో ఇళ్లలో వాడుకున్న నీరు, వర్షపు నీరు రోడ్లపై ఆగి దోమలు విపరీతంగా చేరి ప్రజలు జ్వరాల బారినపడుతున్నారు. రోడ్లపై నడిచివెళ్ళే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విషయం చెప్పినా పట్టించుకునే నాధుడే లేడంటున్నారు. డివిజన్ పరిధిలో శ్మాశాన వాటిక లేకపోవటంతో బల్లేపల్లి వైకుంఠధామానికి వెళుతున్నారు. డివిజన్ పరిధిలోని ఊరచెరువులోని మినీ ట్యాంక్‌బండ్‌లో కరెంట్ లైట్లు లేకపోవటంతో వాకింగ్‌కు వచ్చేవారికి సాయంత్రం సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. సాగర్ కాలువకు ఇరువైపులా నిర్మించిన వాక్‌వేల్లో నిర్మించిన మూత్రశాలలు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో పాటు కోతులు, కుక్కల బెడద అధికంగా ఉండటంతో వాకింగ్‌కు వచ్చిన వారిపై కోతులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

చెరువు అలుగు, పెద్ద స్థంభాలతో అభివృద్ధికి ఆటంకాలు

డివిజన్ పరిధిలో ప్రశాంతినగర్‌లో ఖానాపురం ఊరచెరువు నీరు అలుగు ద్వారా లకారం పోయేందుకు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం చెరువు పరిధిలో వ్యవసాయం లేకపోవటంతో డివిజన్ పరిధిలోని ఇళ్లలో వాడుకున్న నీరు పోయేందుకు వాడుతున్నారు. ఇది ఆక్రమణకు గురైంది. కొందరు ఇళ్లు నిర్మించారు. రెండు నెలల క్రితం వచ్చిన భారీ వర్షాలకు వరద నీరు ఇళ్లలోని ప్రవేశించి ఇబ్బందులు పద్దారు. ఆదే ప్రాంతంలో గతంలో ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద కరెంట్ స్థంభాల కారణంగా రోడ్డుకు ఇరువైపులా ఇంటి నిర్మాణాలకు అనుమతులు నిలిపివేశారు. స్కూల్‌జోన్ పూరుతో ఇంటి నిర్మాణాలకు అనుమతులు నిలిపివేశారు. ఐనప్పటికి కొందరు ఇంటినిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు. వారికి కార్పొరేషన్ అధదికారులు ఎలా పర్మిషన్లు ఇచ్చారో తెలియని పరిస్థితి. స్కూల్‌జోన్ ఎత్తివేయాలని అధికారులకు వినతిపత్రాలు అందించినా సమస్య పరిష్కారం కావటంలేదు.



ప్రశాంతి నగర్‌లో రోడ్ నెంబర్ 16లో మట్టి రోడు

పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

నాగండ్ల కోటేశ్వరరావు, కార్పొరేటర్



ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ఆరో డివిజన్‌లో నాటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో డివిజన్‌లో రూ.20 కోట్ల అభివృద్ధి పనులు పూర్తిచేశా.ఇంకా రూ.10కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజ్ పూర్తిస్థాయిలో లేకపోవటంతో ఇబ్బందులు తప్పటం లేదు. స్కూల్‌జోన్ ఎత్తివేస్తే ఇంటి నిర్మాణాలు పుంజుకోని ఆదాయం సమకూరుతుంది. ఖానాపురం ఊర చెరువు అలుగు ప్రాంతాన్ని సుందరీకరణ చేయాల్సి ఉంది. వాకొవే, మినీ ట్యాంక్‌బండ్‌లలో పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

మురుగు రోడ్లపై నిలుస్తోంది

యడవల్లి వెంకటరావు, ఖానాపురం కొత్తకాలనీ



కల్లూర్‌నగర్ ప్రాంతంలో రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. మురుగునీరు రోడ్లపై నిలిచి జ్వరాల బారినపడుతున్నాం. అధికారులకు, ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించిన సమస్య పరిష్కారం కాలేదు. ఈ ప్రాంతంలో కొత్తగా ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయి. కార్పోరేషన్ అధికారులు అభివృద్ధి పనులు చేపడితే ఇంటి నిర్మాణాలు అధికంగా పుంజుకుంటాయి. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చి అభివృద్ధి వేగంగా జరుగుతుంది.

సమస్యగా కరెంట్ స్థంభాలు

బూర్ల లక్ష్మీనారాయణ, ప్రశాంతినగర్



డివిజన్ పరిధిలోని ప్రశాంతినగర్‌లో అధికంగా కరెంట్ పెద్దపెద్ద స్థంభాలు ఉండటంతో పాటు స్కూల్‌జోన్ కారణంగా ఇంటినిర్మాణాలు నిలిపోయాయి. డ్రెయినేజీలేక వాడుకున్న నీళ్ళు రోడ్లపై ఆగుతున్నాయి. దోమలు అధికంగా వ్యాప్తి చెంది అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి పూట కుక్కల బెడదతో బైటకు వెళ్లే పరిస్థితి లేదు. డివిజన్ పరిధిలో పన్నుల వసూళ్లు అధికంగా వస్తున్నప్పటికి కార్పొరేషన్ అధికారులు ఆ స్థాయిలో అభివృద్ధి పనులు చేయటంలో నిర్లక్ష్యంగానే ఉన్నారు.

పిల్లల సంరక్షణకు పక్కా చర్యలు

అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పిల్లల సంరక్షణకు పక్కా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పిల్లల సంరక్షణపై తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు. పోక్సోకేసుల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈసమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్ రెడ్డి, డీఈవో సోమశేఖరశర్మ, జిల్లా బీసి అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కెవీబీ రెడ్డి, స్నేహ్ స్వచ్చంద సంస్థ డైరెక్టర్ ప్రసాద్, జాగృతి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ భావజాలం స్ఫూర్తిదాయకం

ఖమ్మంక్రైం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ భావజాలం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఏడీసీపీ ప్రసాదరావు అన్నారు. పటేల్ జయంతి సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో గురువారం పోలీసుహెడ్‌క్వార్టర్స్‌లో నివాళులర్పించారు. జాతీయ సమగ్రత కోసం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. దేశం విచ్ఛిన్నం కాకుండా కాపాడిన ఘనత పటేల్‌కే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌ఐలు కామరాజు శ్రీశైలం, సురేష్ పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడిన గురుదాస్ గుప్తా

ఖమ్మంటౌన్,నవంబరు1(ఆంధ్రజ్యోతి): తుదిశ్వాస వరకు కార్మిక,కర్షక హక్కుల కోసం పోరాడిన హక్కుల సాధకుడు గురుదాస్ గుప్తా అని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నారు. గుప్తా వర్ధంతి సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పోటు కళావతి, బీజే క్లెమెంట్, తాతా వేంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, ఏఐటీయూసీ, వివిధ ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ఖాళీలకు దరఖాస్తులు

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు 1(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని కేజీబీవీల్లో అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేయులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. అకౌంటెంట్‌కు బీకాంటీ సర్టిఫికెట్ కోర్సు కంప్యూటర్ ఆపరేటింగ్, ఏఎన్ఎంకు ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఏఎన్ఎం ట్రైనింగ్ సర్టిపికెట్ ఉండాలన్నారు. అభ్యర్థులు ఉమ్మడి ఖమ్మంజిల్లాకు చెందిన వారై ఉండాలని, అభ్యర్థులు దరఖాస్తులను విద్యాశాఖ కార్యాలయంలో నేరుగా వచ్చి పొందవచ్చునని తెలిపారు. పోస్టు ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు. ఈనెల4 నుంచి8లోపు అందించాలని తెలిపారు.

కుటుంబ సభ్యుల చెంతకు బీహార్ వాసి

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు1 (ఆంధ్రజ్యోతి): బీహార్‌కు చెందిన మొహమ్మద్‌సగీర్‌ను శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించారు. నగరంలోని మతిస్తిమితం లేక నడవలేని స్థితిలోన్న వ్యక్తిని స్థానిక పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. వైద్యసేవల అనంతరం వివరాలు తెలిపారు. దీంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం వారు ఖమ్మం కాగా అధికారుల సమక్షంలో సగీర్‌ను ఆయన అన్నదమ్ములైన మొహమ్మద్ ఖదీర్, జుబేర్‌లకు అప్పగించారు. అన్నం శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపి అభినందించారు.

సమగ్ర సర్వేలో ఎటువంటి ధ్రువపత్రాలు అడగొద్దు

- సర్వే ప్రాంతాలకు ఒకరోజు ముందస్తు సమాచారం ఇవ్వాలి
- నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా
- సమగ్ర సర్వే శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ ఇస్తున్న అధికారులు

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు1 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో కుల, ఆదాయ, విద్యా, ఇలా ఎటువంటి దరఖాస్తులను సర్వే బృందాలు స్వీకరించవద్దని ప్రజలు చెప్పిన విషయాలను మాత్రమే నమోదు చేసుకోవాలని ఖమ్మం నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ అహ్మద్ షపీ ఉల్లా, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసరావు సూచించారు. ఖమ్మం డీపీఆర్సీ భవనంలో ఇంటింటి సమగ్ర సర్వేపై శుక్రవారం 164 మంది రిసోర్స్ పర్సన్లు, 85 మంది ఆశ, 204 మంది ఐసీడీఎస్ ఉద్యోగులకు శిక్షణ ప్రారంభించారు. ఈనెల 6 నుంచి సర్వే ప్రారంభమై 18వరకు 15రోజులు పాటు ఇంటింటి సర్వే జరుగుతుందన్నారు. దరఖాస్తులో 84 అంశాలు ఉంటాయని వాటిని ఖచ్చితంగా కుటుంబ సభ్యులను అడిగి మాత్రమే తీసుకోవాలన్నారు. ఒక ప్రాంతంలో కూర్చొని డేటా సేకరించకూడదని ఆదేశించారు. సర్వే ప్రాంతాలకు ఒకరోజు ముందస్తుగా సమాచారం అందించి ప్రజలు నివాసాల్లో ఉన్న సమయంలో సర్వే చేపట్టాలని సూచించారు. ఖమ్మం నగరపాలక సంస్థ 965 ఎన్యూమరేటర్లు బృందాలు, 25 మంది సూపర్‌వైర్లు ద్వారా ఖమ్మం నగరపాలక సంస్థ పరిదిలో సర్వే చేపటనున్నారు. ఇప్పటి వరకు 425మంది ఉద్యోగులు, సిబ్బంది అందుబాటులోకి వచ్చారు. మరో 500 మంది సర్వే కోసం అవసరం ఉంది. దీంతో కమిషనర్ అభిషేక్ ఆగస్త్య శుక్రవారం స్థానిక సంస్థల కలెక్టర్ శ్రీజతో కేఎంసీ కార్యాలయంలో చర్చించారు.

ప్రతీ విద్యార్థిలో ఆంగ్ల పరిజ్ఞానం పెంచాలి

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- మామిళ్లగూడెం పాఠశాలలో బోధన తీరు పరిశీలన
- విద్యార్థులతో మధ్యాహ్న భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

ఖమ్మం,ఖానాపురంహవేలి,నవంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థిలో ఆంగ్ల పరిజ్ఞానం పెంచేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం మామిళ్లగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బోధన తీరును కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై వారిని ఆంగ్లంలో మాట్లాడించి, వారిని చైతన్యపరిచారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై, బోధన ప్రమాణాలు, పాఠశాల సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులు ఆంగ్లం సులువుగా అర్థం చేసుకొని, మాట్లాడే విధంగా యూ కెన్ లెర్న్ స్పోకెన్ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని మన ఖమ్మం జిల్లాలో అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సైతం ఆంగ్ల పదాలు సరిగ్గా ఉచ్చరించి మాట్లాడే విధంగా బోధించాలని కలెక్టర్ సూచించారు. బేస్ లైన్ పరీక్షను పక్కాగా నిర్వహించి క్రమపద్ధతిలో విద్యార్థుల ప్రమాణాలు పెంచేలా చూడాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో కొంతమంది విద్యార్థులు మందు, మత్తుపదార్థాలకు అలవాటు పడినట్లు గుర్తించామని, వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి కౌన్సిలింగ్ ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ సఫలీకృతం కాలేదని హెచ్ఎం, కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. మత్తు పదార్థాలకు బానిస పడిన పిల్లలకు వెంటనే కౌన్సెలింగ్ ఇవ్వాలని, ఇది సులువు కానప్పటికీ టీచర్లు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. క్రీడలు, చదువులో వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో డైనింగ్ హాల్ లేకపోవడం, ప్లే గ్రౌండ్ లేకపోవడంతో ప్రత్యామ్నాయ ప్రదేశానికి ఆలోచన చేయాలన్నారు. పాత డీఆర్డీవో కార్యాలయ భవనాలను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఏఎంఓ రవికుమార్, పాఠశాల హెచ్ఎం లక్ష్మీ, ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధనపై సమావేశం



ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని 4,5,6 డివిజన్లకు చెందిన మున్నూరుకాపుల కార్తీక మాస వనసమారాధన నిర్వహణపై శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈనెలలో మూడు డివిజన్ల పరిధిలోని మున్నూరుకాపు వనసమారాధన నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈసమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు కేదాసు నరసయ్య, సలహాదారుడు జోగం సోమయ్య, నాగయ్య, డివిజన్ల అధ్యక్షుడు తెడ్డు రమేష్, సెక్రటరి ముత్యాల గోవర్ధన్, కోశాధికారి యుగంధర్, సుంకర రమేష్, మల్లేశ్వరరావు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

కామేపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఎంపీడీఓ రవీందర్ నేతృత్వంలో అధ్యక్షుడిగా ఎండీ ఫజల్, ఉపాధ్యక్షుడిగా బి. ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా జె. రాంలాల్‌ను, మహిళా ఉపాధ్యక్షురాలుగా పాతలింగాల ఎస్. అనితను ఎన్నుకున్నారు.

ఐద్వా కొవ్వొత్తులతో ర్యాలీ

ఖమ్మంటౌన్,నవంబరు1(ఆంధ్రజ్యోతి): మహిళలపై అత్యాచారాలను, హింసను అరికట్టాలని ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దీపావళి పర్వదినంరోజు గురువారం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో జిల్లా కార్యదర్శి బండి పద్మ, రాష్ట్ర నాయకురాలు మాచర్ల భారతి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో మహిళలపై అత్యాచారాలు, హింస పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లానేతలు నాగసులోచన, మెహరున్నీసా బేగం, అమరావతి,అజిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐద్వా ఒకటవ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

ఖమ్మంటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నగరంలోని రోటరీనగర్ వద్ద ఏఐటీయూసీ పైలాన్ వద్ద పతాకాన్ని సీపీఐ జాతీయసమితి సభ్యులు బీజే.క్లెమెంట్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మినారాయణ, తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రావి శివరామకృష్ణ, నాయకులు సీహెచ్. సీతామహాలక్ష్మి, పాటి అప్పారావు, పిల్లి రమేష్, పేరబోయిన మోహన్‌రావు, జాకీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి.. వినేవారేరి?

- మధ్యాహ్న భోజన సమయానికి కేఎంసీ సిబ్బంది ఇంటిబాట
- రెండు గంటల పాటు దరఖాస్తుదారుల నిరీక్షణ

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో సిబ్బంది భోజనానికి ఇంటిబాట పట్టి రెండు మూడు గంటలు లేటుగా వస్తుండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు సైతం ఉదయం బయో మెట్రిక్ హాజరు నమోదు జరిగిన తర్వాత తిరిగి విధులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో బయోమెట్రిక్ హాజరు నమోదు చేసి ఇంటికి వెళ్లాలి. సమీకృత కలెక్టర్ కార్యాలయం సహా ఇదే నిబంధనలు అమలు జరుగుతాయి. కానీ ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో మాత్రం అధికారులు, ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బందితో సహా కమిషనర్ కార్యాలయంలో ఉన్నా కూడా మధ్యాహ్న భోజనం పేరుతో 1గంటకు ఇంటికి వెళ్లి తిరిగి 3గంటలకు కార్యాలయానికి చేరుకొంటున్నారు. మరికొంతమంది పని లేకుంటే ఇంట్లోనే సేదతీరుతున్నారు. నిబందనల మేరకు ఉద్యోగులకు మధ్యాహ్నం 1గంట నుంచి 1.45గంటల వరకు మాత్రమే భోజన విరామం ఉంటుంది. ఇలా సమయ పాలన పాటించక పోవటంతో కేఎంసీ పరిపాలనపై ప్రభావం పడుతుందని విమర్శలు ఉన్నాయి.

ఎదురు చూపుతో లబ్దిదారుల్లో విసుగు

మున్నేరు వరద బాధితుల ఎంపిక కొలిక్కి రాలేదు. రోజుకు పదుల సంఖ్యలో కేఎంసీ చుట్టూ బాధితులు ప్రదక్షణలు చేస్తున్నారు. వీరితో పాటుగా ఉచిత విద్యుత్ పథకం గృహజ్యోతి, ఉచిత గ్యాస్ వంటి ఆరు గ్యారెంటీ పథకాల లబ్దిదారులు, ఇతర సమస్యలపై నిత్యం 90 నుంచి 100 మంది వరకు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి వస్తుంటారు. అయితే దరఖాస్తుదారుల సమస్యలు ఆన్‌లైన్ నమోదు కోసం కమిషనర్ అభిషేక్ ఆగస్త్య కేఎంసీలోని ఏ బ్లాక్‌లో ప్రత్యేకంగా ప్రజావాణి కౌంటర్లును ఏర్పాటు చేశారు. నల్గురు కంప్యూటర్ అపరేట్లతో విధులు కేటాయించారు.ఐనప్పటికీ వీరి అలసత్వంతో ప్రజలు విసిగి పోతున్నారు.





మధ్యాహ్నం 1గంటలకు మూసివేసిన ప్రజావాణి కౌంటర్లు, మధ్యాహ్నం 3గంటల వరకు నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి

సీపీ సునీల్‌దత్



సీపీకి వినతిపత్రం అందిస్తున్న హోంగార్డులు

ఖమ్మంక్రైం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో విధులు నిర్వహించే హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. పోలీసు హెడ్‌క్వార్టర్స్ సమీపంలోని ఉన్న కళ్యాణ మండపంలో హోంగార్డు ఆఫీసర్ ఆత్మీయ సమావేశంలోసీపీ మాట్లాడారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన ఇతర సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమించి క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడవద్దన్నారు. అనంతరం హోంగార్డు ఆఫీసర్ల విశ్రాంతికోసం నిర్మిస్తున్న బ్యారక్‌ను సందర్శించారు. ఈసందర్భంగా పలుసమస్యలపై సీపీకి వినతి అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ ప్రసాదరావు, ఎస్‌బీ ఏసీపీ సాంబరాజు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
ZONE
శనివారం 2 నవంబరు 2024
వైరా-మధిర
సత్తుపల్లి
8
WYRA, MADHIRA, SATHUPALLY

నేడు పెనుబల్లికి సినీనటుడు సుమన్ రాక


ప్రారంభానికి సిద్ధంగా విగ్రహం

పెనుబల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్‌లో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు శనివారం సినీనటుడు సుమన్ రానున్నారు. వీఎంబంజర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆయన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి ప్రారంభించనున్నట్లు విగ్రహదాత వేముల నర్సింహారావు తెలిపారు. కార్యక్రమానికి గౌడసంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరుకానున్నారని తెలిపారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం


బేతుపల్లి చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నష్టపోయిన మత్స్యకారుల కుటుంబాలకు అండగా ఉంటామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మత్స్యశాఖ ద్వారా 100శాతం సబ్సిడీపై ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బేతుపల్లి గంగారం పెద్ద చెరువులో మొదటి విడతగా 3.30లక్షల చేపపిల్లలను ఆమె వదిలారు. నియోజకవర్గంలోని 225చెరువలకు 65లక్షల చేప పిల్లలను మొదటి విడతగా పంపిణీ చేయనుండగా ఇదివరకే లంకాసాగర్ ప్రాజెక్టులో 6లక్షల చేపపిల్లలను వదిలామన్నారు. ఇటీవల నష్టపోయిన మత్స్యకార కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం రాష్ట్రప్రభుత్వం అందించనున్నట్లు చెప్పారు. అనంతరంగా రామానగరంలో ఐకేపీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలపై పౌర సరఫరాల శాఖాధికారులతో సమీక్ష నిర్వహించి రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పెనుబల్లి మండలానికి చెందిన 17మందికి క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫిషరీస్ ఏడీ శివప్రసాద్, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఐకేపీ ఏపీఎం కేవీ.సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

మధిర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని దెందుకూరు పీహెచ్‌సీ వైద్యులు డా.పృథ్వీరాజ్ సూచించారు. మధిర టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాంటీ టుబాకో, యాంటీ స్మోకింగ్, గంజాయి, కొకైన్ వంటి మత్తు మత్తు పదార్థాలతో పాటు పాన్ పరాగ్, మానిక్‌చంద్, విమల్, తంబాకు, తుమ్మాకు, జోడాబాయి మొదలైన పాన్ మసాలాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జానపద కళాకారుడు కొండయ్య ఆరోగ్యంపై పలు పాటలు పాడి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో స్కూల్ ఇంచార్జి హెచ్‌ఎం ఖాన్, ఏఎన్‌ఎం విజయకుమారి, జే విజయలక్ష్మి, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



వైరా న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో..


చింతకానిలో దీపావళి వేడుకలు


తల్లాడలో..


కొణిజర్ల మండలం తనికెళ్లలో చిన్నారుల కేరింత

33శాతం రిజర్వేషన్ అమలుచేయాలి

ముదిగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలుచేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మందరపు పద్మ, కోలేటి అరుణ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇసుక అక్రమ రవాణా పై కేసు నమోదు

బోనకల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గుండా ఆంధ్రా నుంచి తెలంగాణాకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ మధుబాబు తనిఖీలు చేయగా పొలంపల్లి నుంచి రెండు ట్రాక్టర్లల్లో అక్రమంగా ఇసుకను తెలంగాణకు తరలిస్తూ పట్టుబడ్డారు. అక్రమ తోలకదారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీ20 క్రికెట్ పోటీలకు మదర్‌థెరిస్సా విద్యార్థి ఎంపిక

సత్తుపల్లిరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ పసిఫిక్ స్పోర్ట్స్ ఫెడరేషన్(ఐపీఎస్‌ఎఫ్) టీ20 క్రికెట్ పోటీలకు మండంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి వర్దెబోయిన యశ్వంత్‌కుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థిని యజమాన్యం అభినందిస్తూ ఘనంగా సన్మానించింది. ఇండియన్ స్పోర్ట్స్ ఫెడరేషన్ గతనెల 25నుంచి 27వరకు ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన టోర్నీలో తెలంగాణ క్రికెట్ జట్టుకు నాయకత్వం వహించిన యశ్వంత్‌కుమార్ టీమ్‌ను రన్నరప్‌గా నిలపడంతో ప్రముఖ పాత్ర పోషించాడు. అంతేకాకుండా 100మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచిన యశ్వంత్ ఇండియన్ పసిఫిక్ స్పోర్ట్స్ ఫెడరేషన్ టీ20పోటీలకు ఎంపికయ్యాడు. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.జే.కుమార్ రాజా, ఇంజనీరింగ్ డీన్ డా.జాకీర్‌హుస్సేన్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డా.ఎంవీ.రామచంద్రరావు, సీఎస్సీ, ఫార్మసీ విభాగాధిపతులు పీ.మారేశ్వరరావు, డా.డీ.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

టీయూఎస్ కార్యవర్గం

వైరా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైరాలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం(టీయూఎస్) కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్.పాషా, గౌరవరపు డేవిడ్‌రాజు, గౌరవాధ్యక్షుడిగా యామాల గోపాలరావు, పూర్ణకంటి రామారావు, ఉపాధ్యక్షులుగా సూర్యదేవర సంగమేశ్వరప్రసాద్, గిద్దగిరి సత్యనారాయణ, పామర్తి నర్సింహారావు, ప్రచార కార్యదర్శులుగా షేక్.లాల్‌మియా, సయ్యద్ హతవుల్లా, సహాయ కార్యదర్శులుగా ఓర్సు శ్రీనివాసరావు, దొంత నర్సింహారావు, నల్లగట్ల బాబు, కోశాధికారిగా మిట్టపల్లి రాఘవరావును ఎన్నుకున్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

కల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యం సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కల్లూరులో జిల్లా ఆర్యవైశ్యం సంఘం మహాసభ అధ్యక్షుడిగా ఎంపికైన పసుమర్తి చందర్‌రావుకు ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య ప్రముఖులు చారుగుండ్ల అచ్యుత, గుర్రం పూర్ణయ్య, గుర్రం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారం కోసం చందర్‌రావు కృషి చేయాలని కోరారు.

వైద్య విద్యార్థికి ఎన్నారై ఆర్థికసాయం

వైరా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైరాలోని బ్రాహ్మణపల్లి అగ్రహారాన్ని చెందిన కాంద్ర కిరణ్ అనే వైద్య విద్యార్థికి ప్రవాసభారతీయుడు కొండబోలు సురేష్ రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శుక్రవారం వైరాలో సురేష్ ప్రతినిధి అయిన జీవీ.సూర్యప్రకాశరావు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీడీవో సరస్వతీ, ఎంఈవో వెంకటేశ్వర్లు, మునిసిపల్ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు రూ.15వేలను కిరణ్‌కు అందజేశారు. కిరణ్ కరీంనగర్ ప్రతిమ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు.

అన్నవరం, పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు: డీఎం

సత్తుపల్లిరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి అన్నవరం, పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం యూ.రాజ్యలక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3, 10, 14, 17, 24తేదీలలో అన్నవరానికి 64099సర్వీస్ నంబర్‌తో నడిచే డీలక్స్ బస్సులో చార్జ్ రూ.530గా నిర్ణయించామని, 3,10,17,24వ తేదీలలో 64097సర్వీస్‌తో పంచారామాలకు డీలక్స్ రూ.1500గా చార్జీ నిర్ణయించినట్లు తెలిపారు. వీటికి ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, 30-40మంది భక్తులకు పుణ్యక్షేత్రాలకు బస్సు ఏర్పాటు చేస్తామని, శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేకంగా సూపర్‌లగ్జరీ బస్సులు ఇవ్వనున్నామని చెప్పారు. అదేవిధంగా తమిళనాడులోని అరుణాచల గిరిప్రదక్షణ, కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్ పుణ్యక్షేత్రాలకు బస్సు నడపనుండా నవంబర్ 13తేదీన రాత్రి బయల్దేరి 16వ తేదీ ఉదయం సత్తుపల్లికి చేరుకుంటుందని, ఈ అవకాశాలను భక్తులు, ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మెస్‌ఛార్జీల పెంపు పట్ల హర్షం

వైరా/మధిరరూరల్ నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెస్‌ఛార్జీల పెంపు పట్ల బీసీ గురుకులం విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని రెబ్బవరంలో నిర్వహిస్తున్న ముసలిమడుగు మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు , తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్(టీజీపీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇన్‌చార్జ్ కోట లోకేష్ పేర్కొన్నారు. శుక్రవారం మెస్‌ఛార్జీల పెంపు పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి పెరగని మెస్‌ఛార్జీలతో తమకు పౌష్టికాహారం కష్టంగా ఉందని పేర్కొన్నారు. మెస్‌ఛార్జీలు పెంచిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విద్యార్థినులతోపాటు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

మధిరటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్య లు తప్పవని టౌన్ ఎస్‌ఐ సంధ్య హిజ్రాలను హెచ్చరించారు. శుక్రవారం ఆమె మధిర టౌన్ పోలీస్ స్టేషన్ లో హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు, ఫంక్షన్‌లు, పెళ్లిల్లు, దుకాణదారులను, మామూళ్ల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

పెనుబల్లిలో కుక్క స్వైరవిహారం

పెనుబల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లిలో గురువారం ఓ కుక్క పలు వీధుల్లో స్వైరవిహారం చేసి ఎనిమిదిమందిని గాయపర్చింది. పెనుబల్లిలోని ఎస్సీకాలనీ, ఎస్టీకాలనీ, ఎంపీడీవో కార్యాలయం, బీసీ కాలనీ, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా చేరి అటుగా వెళ్తున్న చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ఒక్కరోజులోనే పెనుబల్లికి చెందిన బీరెల్లి రవి, వాడపల్లి సాత్విక్, మారిని సీత, బొర్రా చెన్నారావు, రెండు సంవత్సరాల బాలికతోపాటు మరో ముగ్గురిపై కుక్క దాడిచేసి గాయపర్చింది.

10క్వింటాళ్ల బియ్యం చోరీ

సత్తుపల్లిరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10క్వింటాళ్ల బియ్యం చోరీకి గురయ్యాయి. దీపావళి సందర్భంగా సెలవుల అనంతరం శుక్రవారం పాఠశాలకు రాగా మిడ్డే మీల్స్ గది తాళం పగులగొట్టి ఉండగా అందులో నిల్వ ఉంచిన 16క్వింటాళ్లలో 6క్వింటాళ్లు మాత్రమే ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం పూరేటి యాకోబు తెలిపారు.